సాక్షి మెదక్

శనివారం । 20 । జూలై । 2024



'మీ సేవ'కు వందనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న అన్నిరకాల సేవలు మీసేవ ద్వారానే జరుగుతున్నాయి.

వివరాలు 8లో ▶



'నాటి'న మొక్కలేవీ?

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో పచ్చదనం పోయి మైదానంగా మారింది.

వివరాలు 8లో ▶



మట్టి రోడ్లకు మోక్షమెప్పుడు

గుంతలు పడిన రోడ్లు వర్షాలతో బురదమయం కావడంతో గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు.

వివరాలు 9లో ▶

నేడు మెదక్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై శనివారం ప్రజలకు ఫోన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ: మెదక్
కమిషనర్: జానకీరాం సాగర్
తేదీ: 20- 07- 2024 (శనివారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
9154293322

టీచర్ల సర్దుబాటు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చిన్నశంకరంపేట మండలం అగ్రహారం ప్రాథమిక పాఠశాల. ఇందులో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 36 మంది ఉన్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఇందులో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఒక్కరు మాత్రమే బోధిస్తున్నారు. ఈనెల 15న కాంప్లెక్స్‌లో జరిగే సమావేశానికి ఉపాధ్యాయుడు ఉదయం 11 గంటలకు స్కూల్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో చదువు చెప్పే వారు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి పోయారు. ఇలాంటి పాఠశాలలు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నాయి.

తక్కువ మంది విద్యార్థులుండి ఎక్కువ టీచర్లుంటే బదిలీ



మెదక్‌జోన్: జిల్లాలో 20 మండలాలు ఉండగా ఆయా బడుల్లో పనిభారం తగ్గించేందుకు ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన నివేదికలు తెప్పించుకొని ఎంఈఓ, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఇతర నోడల్ అధికారితో కమిటీలు వేస్తున్నారు. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండి, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లోకి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా ఉపాధ్యాయులు వచ్చే వరకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య ప్రాథమిక పాఠశాలల్లోనే అధికంగా ఉంది.

బదిలీ అయినా అక్కడే...

ఏకోపాధ్యాయుడు ఉన్న బడి టీచర్ మరో చోటుకు బదిలీ అయినా, ఆ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడు వచ్చే వరకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు అక్కడే ఉండాల్సిందే. ఉన్న ఒక్కరు బదిలీపై వెళితే ఆ పాఠశాల మూతపడే పరిస్థితి నెలకొంటుంది. కొత్త నియామకాలు చేపట్టి ఉపాధ్యాయులు వస్తే బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 897 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో మొత్తం 897 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 84 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఉండాలి. 30 మంది దాటితే ఇద్దరు ఉపాధ్యాయులు బోధించాలి. కానీ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనికి తోడు ఇటీవల బదిలీలు కావడంతో విద్యావ్యవస్థ గందరగోళంగా మారింది.

జిల్లాలో బదిలీలు ఇలా..

జిల్లాలో 43 మంది పీజీ హెచ్‌ఎంలు బదిలీపై వెళ్లిపోయారు. 20 మంది స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)లకు పీజీ హెచ్‌ఎం ప్రమోషన్లు రావడంతో వారు వెళ్లిపోయారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) క్యాడర్ 562 మంది బదిలీపై రిలీవ్ అయ్యారు. 499 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)గా ప్రమోషన్లు వచ్చాయి. అలాగే 1,076 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీలు) బదిలీ కాగా వారిలో 699 మంది మాత్రమే రిలీవ్ అయ్యారు. అంటే 70 శాతం మంది రిలీవ్ కాగా ఇంకా 30 శాతం మంది.. అనగా 377 మంది ఎస్జీటీలను నిలిపివేశారు. వీరు పనిచేస్తున్న పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో పాటు ఉండాల్సిన బోధకుల సంఖ్య కంటే తక్కువగా ఉండడంతో రిలీవ్ చేయడం లేదు. బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ చేయాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉండి బోధకులు లేకపోవడంతో వారిని నిలిపివేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

బోధనలో ఇబ్బంది లేకుండా

బోధనలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సర్దుబాటు చేస్తున్నాం. ప్రమోషన్లు వచ్చిన చాలా మంది ఉపాధ్యాయులు రిలీవ్ అయి వెళ్లిపోయారు. జిల్లాలో సెకండ్ గ్రేడ్ టీచర్లు 1,076 మందికి బదిలీలు కాగా ఇప్పటివరకు 699 మంది రిలీవ్ అయ్యారు. ఇంకా 377 మంది రిలీవ్ కావాల్సి ఉంది. వారు వెళ్లిపోతే బోధించేందుకు ఇబ్బందులు తలెత్తడంతో వారిని ఆపేశాం. ఎక్కువ ఉపాధ్యాయులు ఉన్న బడి నుంచి లేని చోటకు పంపుతున్నాం.

– రాధాకిషన్ డీఈఓ మెదక్

వెట్టి నుంచి విముక్తి వైపు

- ఆపరేషన్ ముస్కాన్‌తో సత్ఫలితాలు
- 28 మంది బాలలకు విముక్తి
- 'సాక్షి'తో డీసీడబ్ల్యూఓ కరుణశీల



మెదక్ కలెక్టరేట్: మైనర్లను పనిలో పెట్టుకోవద్దని, ఎవరైనా చట్టాలను విస్మరిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి (డీసీడబ్ల్యూఓ) కరుణశీల హెచ్చరించారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్‌తో జిల్లావ్యాప్తంగా ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 28 మంది బాలలకు వెట్టి నుంచి విముక్తి కల్పించినట్లు చెప్పారు. ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ బృందాలు ఈనెలాఖరు వరకు జిల్లాను రెండు డివిజన్లుగా విభజించి పర్యటిస్తాయన్నారు.

అన్ని మండలాల్లో సెర్చ్

జిల్లాలోని అన్ని మండలాల్లో ఆపరేషన్ ముస్కాన్ సెర్చ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇటుక బట్టీలు, కంపెనీలు, హోటళ్లు, కిరాణా షాపులు, ఇతర దుకాణా ల్లో సోదాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గుర్తించిన 28 మందిలో పాఠశాల, కళాశాల డ్రాపౌట్ పిల్లలు ఉన్నారన్నారు. మైనర్లు, వారి తల్లిదండ్రులు, దుకాణాల యజమానులను చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి బాలలను పాఠశాలలు, కళాశాలలకు పంపించామని వివరించారు.

ఆర్థిక సమస్యలే కారణం

తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించినప్పటికీ ఆర్థిక సమస్యలతో మధ్యలో బడి మాన్పించి పనులకు పంపుతున్నట్లు డీసీడబ్ల్యూఓ తెలిపారు. జిల్లాలో చాలావరకు ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈవిషయమై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

రిపోర్టుల ఆధారంగా కేసులు

మైనర్లతో ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేయిస్తే ఒక విధమైన కేసు ఉంటుందని, సాధారణ ప్రాంతాల్లో పనిచేయిస్తే మరో కేసు ఉంటుందన్నారు. అసిస్టెంట్ లేబర్ అధికారి రూపొందించే రిపోర్ట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేస్తారని తెలిపారు.

షరతులు లేకుండా మాఫీ చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలప్పుడు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ప్రస్తుతం అనేక షరతులు విధించిందన్నారు. అందరికీ రుణమాఫీ చేయకపోయినా సంబరాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. సంబరాల్లో రైతులెవరూ లేరని, కాంగ్రెస్ నాయకులు మాత్రమే ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో దివంగత సీఎం వైఎస్సార్ అన్నిరకాల రుణాలు ఏకకాలంలో చేశారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ రుణమాఫీ చేయలేదని ఆరోపించడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. రైతు బీమాను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఎవరో కూడా తెలియని అధికారులు నియోజకవర్గంలో ఉండడం విచారకరమని అన్నారు. ప్రొటోకాల్ మేరకు తనను ఆహ్వానించి అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, షేక్ హుస్సేన్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రుణమాఫీ రైతులకు వరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రుణమాఫీ రైతులకు వరం లాంటిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బూరుగుపల్లిలో రైతులతో కలిసి ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ చేయడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందన్నారు. రైతుల బాధలు అర్థం చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, ఆర్యన్‌సంతోష్, జనార్దన్, సత్యనారాయణరావు, పెరుమాండ్ల గౌడ్ పాల్గొన్నారు.

అర్హులు నష్టపోయారు



మాట్లాడుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనేక షరతులు విధించడంతో అర్హులైన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు అధికారం అప్పగిస్తే బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తున్నారని విమర్శించారు. స్పెషల్ ఆఫీసర్ల పాలనతో గ్రామాలు అధ్వానంగా మారాయన్నారు. పోలీసులు వాహనాల తనిఖీ పేరిట భారీగా జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. అభివృద్ధి పనులు, విద్యాసంస్థలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. సమావేశంలో ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు రమణారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గురుకుల ప్రిన్సిపాల్ మృతి



రామాయంపేట(మెదక్): రామాయంపేట సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి (55) శుక్రవారం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇటీవల హాస్టల్‌లో విద్యార్థినులను ఎలుకలు కొరికిన సంఘటనలో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్‌గా తప్పించి వైస్ ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించారు. సరళాదేవి మృతితో ఉపాధ్యాయులు, విద్యార్థులు కంటతడి పెట్టారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సురేందర్ సంతాపం వ్యక్తం చేశారు.

పరిశోధనలపై ఆసక్తి అవసరం



అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన

డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. శుక్రవారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ బాలానగర్ ఆధ్వర్యంలో గగన్‌యాన్- 3, ఇతన పరిశోధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు, అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎస్‌పీడీఓ గణేష్, టెక్నికల్ అధికారి మల్లయ్య, ఎంఈఓ బుచ్యానాయక్, హెచ్‌ఎం బాలచంద్రం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాధుల నిర్మూలన, స్వచ్ఛదనం- పచ్చదనం అనే నినాదంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రత్యేక అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాలను సందర్శిస్తూ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన మహోత్సవంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రణీద్‌కుమార్

రామాయంపేట(మెదక్): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని దామరచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించడంతో పాటు పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో ప్రత్యేకంగా వాలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మోహనశర్మ, నిజాంపేట మండలశాఖ అధ్యక్షుడు నవీన్ రత్నాకర్, జిల్లా నాయకులు రమేశ్, శేఖర్, వెంకట్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'పై అవగాహన



మెదక్ కలెక్టరేట్: ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణ ఔత్సాహికుల పాలిట వరమని, ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీపీఓ, డీఎల్పీఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటా ఇన్నోవేటర్‌పై గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసుకొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఔత్సాహికులు 9100678543 నంబర్‌కు వాట్సాప్‌లో వివరాలు పంపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇన్నోవేటర్స్ నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ ఆగస్టు 3 వరకు ఉందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యా దయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ఉత్తమ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ ప్రధానమంత్రి అవార్డును అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో భారతీయ పాలన, ప్రజా విధానం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన డిప్యూటీ కమిషనర్లతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సుపరిపాలనపై చేపట్టిన చర్యలను పూర్తిస్థాయిలో వివరించారు. గతంలో ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలోనూ ఇన్నోవేటర్ ప్రోగ్రాంకు సంబంధించి ప్రధానమంత్రి అవార్డు వచ్చిందని తెలియజేశారు. ప్రస్తుతం దేశంలో సుపరిపాలనపై చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఇతర దేశస్తులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను అభినందించారు.

శాకాంబరి దేవిగా విద్యాధరి దర్శనం



సామూహిక లక్ష బ్రాక్షార్చనలో భక్తులు

వర్గల్(గజ్వేల్): అమ్మ ఆషాఢవైభవంతో అలరారింది. కూరగాయలే ఆభరణాలయ్యాయి. ప్రాంగణం పచ్చని పందిరి తోటను తలపించింది. ఏ వైపు చూసినా పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో ఆషాఢానికి ప్రతీకగా నిలిచింది. వర్గల్ క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మూల నక్షత్ర మహోత్సవ వేళ విద్యాసరస్వతి మాత శాకాంబరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సప్తశతి పారాయణం, కుంకుమార్చన, సామూహిక భక్తజన లక్ష బ్రాక్షార్చన జరిపారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.



క్లుప్తంగా

కౌన్సిలర్‌ శైలజ ఎన్నిక చెల్లదు

కోర్టు తీర్పు ఇచ్చినట్లు వెల్లడించిన నాయకులు



అదనపు కలెక్టర్‌కు పత్రాలను అందిస్తున్న నాయకులు, అభ్యర్థి నర్సింహ్మారావు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్‌ పరిధిలో గల పదవ వార్డులో కౌన్సిలర్‌గా గెలుపొందిన శైలజ బీసీ వర్గానికి చెందిన మహిళ కాదని, కౌన్సిలర్‌గా నర్సింహ్మారాజును కొనసాగించాలని కోర్టు తీర్పు ఇచ్చినట్లు శుక్రవారం కాంగ్రెస్‌ నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్‌ పరిధిలో గల పదవ వార్డు కౌన్సిలర్‌గా 2020లో శైలజ గెలుపొందింది. బీసీ జనరల్‌ స్థానం నుంచి శైలజ పోటీ చేశారు. కాగా శైలజ బీసీ వర్గానికి చెందిన మహిళ కాదని అప్పట్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న నర్సింహ్మరాజు కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు ఆమె బీసీ వర్గానికి చెందిన మహిళ కాదని తేల్చింది. ఇందుకు సంబంధించిన కోర్టు తీర్పు పత్రాలను అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌కు నర్సింహ్మారావుతో కలిసి నాయకులు అందించారు. ఎన్నికల అధికారులతో చర్చించి కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని అదనపు కలెక్టర్‌ చెప్పినట్లు నాయకులు వెల్లడించారు.

ఖేడ్‌ డీఐవోఎస్‌ సరెండర్‌

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌ డీఐవోఎస్‌ (డివిజనల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వేయర్‌) కృష్ణను కలెక్టర్‌ కార్యాలయానికి సరెండర్‌ చేసినట్లు ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. ఖేడ్‌ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న డీఐవోఎస్‌పై విధుల్లో నిర్లక్ష్యం, ప్రజలకు నిర్లక్ష్యపు సమాధానం తదితర అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో అతడిని కలెక్టర్‌ కార్యాలయానికి సరెండర్‌ చేసినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

శివ్వంపేట(నర్సాపూర్‌): బాలికపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని ఓ తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతోంది. బాలికకు జ్వరం రావడంతో 14వ తేదీన తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. గురువారం ఆమెను ఇంటి వద్ద వదిలేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం తల్లి ఇంటికొచ్చేసరికి అదే తండాకు చెందిన 20 ఏళ్ల యువకుడు బాలికపై అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తుండగా అడ్డుకొని పట్టుకోబోతుండగా పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నవజాత శిశువు మృతి



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

బెజ్జంకి(సిద్దిపేట): నవజాత శిశువు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన మహిళ స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శిశువుకు జన్మనిచ్చింది. పిల్లల వైద్యుడికి పాపను చూపించేందుకు కరీంనగర్‌లోని ఆస్పత్రికి వెళ్లగా చిన్నారి మార్గమధ్యలో మృతి చెందింది. స్థానికంగా పిల్లల వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో చిన్నారి మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఘటనా స్థలానికి సిద్దిపేట రూరల్‌ సీఐ శ్రీనివాస్‌, బెజ్జంకి ఎస్‌ఐ నరేశ్‌ చేరుకొని వారిని సముదాయించారు. కుటుంబానికి న్యాయం చేస్తామని తెలుపడంతో వివాదం సద్దుమణిగింది.

మీ సేవకు వందనం

- కేంద్రాల్లో వినియోగదారులకు ఇక క్యూఆర్‌
- అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే..
- అధిక వసూళ్లకు చెక్‌ పడినట్లే..
- పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు



సిద్దిపేటలోని మీ సేవ కేంద్రం

ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ రంగ సేవలను సులభంగా, వేగంగా అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామాల్లో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న అన్ని రకాల సేవలు వీటి ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో రెవెన్యూ సంబంధిత సేవలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో కొందరు నిర్వాహకులు రుసుము తీసుకునే విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది.

– సిద్దిపేటరూరల్‌

మీ సేవ కేంద్రాల్లో ఆయా సేవలకు తీసుకోవాల్సిన రుసుమును ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నగదును జూలై నెల నుంచి క్యూఆర్‌ కోడ్‌ ద్వారా చెల్లించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మీసేవ కేంద్రాల్లో క్యూఆర్‌ కోడ్‌ స్కానర్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు క్యూ ఆర్‌ కోడ్‌పై అవగాహన తక్కువగా ఉన్న సమయంలో నిర్వాహకులే వినియోగదారుల ఫోన్‌ తీసుకొని స్కాన్‌పై అవగాహన కల్పించి చెల్లింపు జరిగేలా చూడనున్నారు. ఈ మేరకు ప్రజలు మీసేవ కేంద్రాల్లో ఎలాంటి దరఖాస్తులు చేసుకున్నా, దరఖాస్తుకు సంబంధించిన చెల్లింపు క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేస్తే ఆటోమెటిక్‌గా ఆ సేవకు సంబంధించిన రుసుము వివరాలను చూపిస్తుంది. దీని వల్ల నిర్వాహకులు అదనంగా డబ్బులు దండుకునేందుకు వీలు లేకుండా ఉంటుంది.

జిల్లాలో మీ సేవ కేంద్రాలు	ప్రభుత్వ ఈ సేవ
203	01

అధిక దోపిడీకి చెక్‌..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మీసేవ కేంద్రాల్లో ఏదైనా సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసిన అనంతరం నిర్వాహకులు కనీస ఆన్‌లైన్‌ రుసుము కంటే రెట్టింపు వరకు తీసుకుంటున్నారు. రూ.100 తీసుకోవాల్సి ఉంటే కొందరు నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా రెవెన్యూ సంబంధిత ధ్రువపత్రాల అవసరం రోజువారీగా ఎక్కువగా ఉండేందుకు అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూఆర్‌ కోడ్‌ చెల్లింపులతో అధిక దోపిడీకి చెక్‌ పెట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఎల్‌–1 డివైజ్‌తో ఈకేవైసీ, బయోమెట్రిక్‌..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఎలాంటి పథకానికైనా ఈకేవైసీ తప్పనిసరి అయినందున బయోమెట్రిక్‌ యంత్రాల ద్వారా వేలి ముద్రలు తీసుకుంటారు. ఈ క్రమంలో నూతనంగా మీసేవ కేంద్రాలకు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని, యూఐడీఏఐ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌–0 బయోమెట్రిక్‌ యంత్రాల స్థానంలో నూతనంగా ఎల్‌–1 బయోమెట్రిక్‌ పరికరాన్ని ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూలై నుంచి ఎల్‌–1 యంత్రాలు వినియోగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ మళ్లీ ప్రభుత్వం సెప్టెంబర్‌ వరకు గడువు విధించింది. ఈ యంత్రం తప్పనిసరి కావడంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు వాటిని కొనుగోలు చేయాల్సి ఉంది.



క్యూఆర్‌ కోడ్‌తో చెల్లింపు చేస్తున్న సిబ్బంది

క్యూఆర్‌తోనే చేయాలి



మీ సేవ కేంద్రాల్లో క్యూఆర్‌ స్కాన్‌తోనే ఆన్‌లైన్‌లో సేవలకు సంబంధించిన రుసుములు చెల్లింపు చేసే విధానం అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో ప్రజలు ఈ విషయాన్ని గమనించి సేవకు తగిన రుసుము చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు బయోమెట్రిక్‌ ఎల్‌–1 పరికరాలు కొనుగోలు చేయాలి.

– ఆనంద్‌, ఈ జిల్లా మేనేజర్‌

టీచర్‌ సెలవు పెడితే విద్యార్థులకూ సెలవే

ముగ్గురు విద్యార్థులు.. ఒక్కరే టీచర్‌



ముగ్గురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి

హుస్నాబాద్‌: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టినప్పటికీ కొన్ని పాఠశాలలకు కొత్తగా ఉపాధ్యాయులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉన్న ఉపాధ్యాయులు మరో చోటకు పోస్టింగ్‌ పెట్టుకున్నప్పటికీ, వీరి స్థానంలో రిలీవర్‌ రాకపోవడంతో అక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఇక్కడే ఉందామంటే విద్యార్థులు దుస్థితి. అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు భాగ్యలక్ష్మి ఒక్కరే టీచర్‌ విద్యాబోధన చేస్తున్నారు. 1వ తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఒకరు, మూడవ తరగతిలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నారు. ఈ టీచర్‌ కూడా మరో పాఠశాలకు బదిలీ పెట్టుకున్నప్పటికీ కొత్త ఉపాధ్యాయులు ఎవరూ ఇక్కడికి పోవడంతో ఆమె ఇక్కడే ఉండిపోయారు. ఈ తండాలో దాదాపు 20 మందికి పైగా విద్యార్థులున్నారు. ఇక్కడి పాఠశాలలో టీచర్ల కొరత ఉండటం, అది కూడా ఒక్కరే టీచర్‌ ఉండటంతో పిల్లల తల్లిదండ్రులు హుస్నాబాద్‌కు పంపిస్తున్నారు. ఏదైనా కారణంతో టీచర్‌ సెలవు పెడితే ఆ రోజు విద్యార్థులకు కూడా సెలవే.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్‌



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

- ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్‌
- అర్హులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేసి తీరుతాం
- పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను కాంగ్రెస్‌ నిలబెట్టుకుంటుందని పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హనుమంతరావు హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. కేసీఆర్‌ రాష్ట్ర రైతుల పరిస్థితిని పట్టించుకోకుండా, మహారాష్ట్ర, పంజాబ్‌ రాష్ట్రాల్లోని రైతులకు ఆర్థిక సహాయం అందించారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రాజెక్టుల నిర్మాణాలతో అయోమయంగా తయారు చేశారన్నారు. ఎవరినీ ప్రగతిభవన్‌, సెక్రటేరియేట్‌కు రానీయకుండా అడ్డుకున్నారన్నారు. అందువల్లే రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు రైతుల వద్దకు వెళ్లి రుణమాఫీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌, కలీమొద్దీన్‌, పూజల గోపి కృష్ణ, మంద పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్‌: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హుస్నాబాద్‌ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఎల్లంబజార్‌లో నివసిస్తున్న పోలు సమ్మయ్య (45) హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం యథావిధిగా పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో సమ్మయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అందరూ పడుకున్న తర్వాత రాత్రి ఇంటి బయట ఉన్న పిల్లర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారు జామున భార్య లేచి చూసేసరికి ఉరివేసుకొని కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు..

దుబ్బాకరూరల్‌: ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాంతుల నందన్‌కుమార్‌ (24) ఏడు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దే ఉండటంతో ఏదైనా పని చేసుకోమని తల్లిదండ్రులు మందలించారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి దుబ్బాకలోని పశువుల సంత వద్ద గడ్డికి కొట్టే క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని స్నేహితుడికి ఫోన్‌ ద్వారా తెలపగా అతడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకొని నందన్‌ కుమార్‌ను దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంగరాజ్‌ తెలిపారు.

కుంటలో పడి చేపల కాపరి మృతి

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులో పడి చేపల కాపరి మృతి చెందిన ఘటన హత్నూర మండలం చింతల్‌ చెరువు గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చింతల్‌ చెరువు గ్రామానికి చెందిన అంబటి రమేశ్‌ (29) గ్రామ శివారులోని అంబటి వారి కుంటలోని నీటిలో ఉన్న చేపలకు కాపరిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం సాయంత్రం రమేశ్‌ చేపల వద్ద ఉండేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రికి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం కుంట వద్దకు వెళ్లారు. కట్టపై బైక్‌తోపాటు చెప్పులు కనిపించగా కుంటలో రమేశ్‌ మృతదేహం తేలింది. మృతుడికి నెల రోజుల కిందటే పెళ్లి జరగడంతో మృతుడి భార్య వీరమని రోదన మిన్నంటాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌ తెలిపారు.

క్రెడిట్‌ కార్డు అప్‌డేట్‌ అంటూ మోసం

రూ.1.93 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్‌ ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్‌: క్రెడిట్‌ కార్డు అప్‌డేట్‌ అంటూ సైబర్‌ నేరగాళ్లు ప్రైవేటు ఉద్యోగిని మోసం చేసిన ఘటన పటాన్‌ చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్‌కి చెందిన ఓ ప్రైవేట్‌ ఉద్యోగినికి 17వ తేదీన అపరిచిత వ్యక్తులు బ్యాంక్‌ నుంచి కాల్‌ చేస్తున్నామని చెప్పారు. క్రెడిట్‌ కార్డు అన్యూవెల్‌ సర్వీస్‌ చార్జెస్‌ యాక్టివేషన్‌ చేయాలని ఫోన్‌ రావడంతో బాధితురాలు తన వివరాలను చెప్పడంతోపాటు ఫోన్‌కి వచ్చిన ఓటీపీ చెప్పింది. దీంతో వెంటనే బాధితురాలి ఖాతాలో ఉన్న రూ.1.93 లక్షలు డ్రా అయినట్టు మెసేజ్‌ వచ్చింది. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

రాయపోలు(దుబ్బాక): రేషన్‌ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం మేరకు.. యాదాద్రి–భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మడోత్‌ భాస్కర్‌ తన వాహనంలో 18.75 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని చేగుంట, తూప్రాన్‌ ప్రాంతాల్లో విక్రయించేందుకు వెళ్తున్నాడు. అంకిరెడ్డిపల్లి వద్ద టాస్క్‌ ఫోర్స్‌ అధికారులు, రాయపోలు పోలీసు సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని, బియ్యాన్ని సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు

పరిశీలించిన ఫారెస్ట్‌ అధికారులు



చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రం నుంచి సూరారం వెళ్లే రోడ్డుపై నరికిన వంద చెట్లను గుర్తించిన గ్రామ పంచాయతీ అధికారులు చర్యల కోసం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన "వందకు పైగా చెట్లు నరికివేత" కథనానికి స్పందించిన అధికారులు చిన్నశంకరంపేట సెక్షన్‌ ఫారెస్ట్‌ ఆఫీసర్‌ అజాం అలీ, బీట్‌ ఆఫసర్‌ జాంన్సీ నరికిన చెట్లను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో 62 చెట్లను, రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలో 38 చెట్లను నరికివేసినట్లు గ్రామ కార్యదర్శులు సంతోష్‌, అనురాధ నివేదిక రూపొందించి ఫారెస్ట్‌ అధికారులకు అందించారు. చెట్ల నరికివేతతో జరిగిన నష్టం అంచనా వేసి పరిశ్రమ యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి..

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదస్థలిలో రాజేశ్‌, మురళీ

గజ్వేల్‌రూరల్‌: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం గజ్వేల్‌ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్‌)కి చెందిన నిమ్మరాజు పోచయ్య–పోచమ్మ దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు నిమ్మరాజు రాజేశ్‌ (19) ఉన్నారు. వీరు ప్రస్తుతం గజ్వేల్‌ పట్టణంలో నివాసముంటున్నారు. రాజేశ్‌కు సమీప బంధువైన గజ్వేల్‌లో ఉంటున్న శంబయ్యగారి మురళీతో కలిసి గురువారం అర్ధరాత్రి గజ్వేల్‌ నుంచి ప్రజ్ఞాపూర్‌ వైపు కారులో బయలుదేరారు. మురళీ డ్రైవింగ్‌ చేస్తుండగా, పక్క సీటులో రాజేశ్‌ కూర్చున్నాడు. మార్గమధ్యలోని ఆంధ్రా బ్యాంకు సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా రాజేశ్‌ మృతి చెందాడు. మురళీకి తీవ్ర గాయాలు కాగా గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు. వీరు ప్రయాణిస్తున్న కారులో మద్యం బాటిళ్లు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ పోలీసులు తెలిపారు.

బిర్యానీ సెంటర్‌లో ఫుడ్‌ పాయిజన్‌

10 మందికి పైగా అస్వస్థత

తూప్రాన్‌: బిర్యానీ సెంటర్‌లో ఫుడ్‌ పాయిజన్‌ కావడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన తూప్రాన్‌ డివిజన్‌ కేంద్రంలోని ఓ మండి బిర్యానీ సెంటర్‌లో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన 10 మందికి పైగా యువకులు ఈ నెల 16న స్థానిక మండి బిర్యానీ సెంటర్‌లో రాత్రి భోజనం చేశారు. బుధవారం తెల్లవారుజామున నుంచి వాంతులు, వీరేచనాలు కావడంతో పట్టణంలోని ఆస్పత్రులతోపాటు మేడ్చెల్‌ జిల్లాలోని వివిధ ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స పొంతున్నారు. బిర్యానీ పాయింట్‌లో ఫుడ్‌ పాయిజన్‌ కావడంతోనే ఇలా జరిగిందని అధికారులు తేల్చారు.

దొంగల హల్‌ చల్‌

వెల్దుర్తి(తూప్రాన్‌): మండల కేంద్రమైన వెల్దుర్తిలో మరోసారి దొంగలు హల్‌చల్‌ చేశారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకొని ఐదు ఇళ్లలో చోరీకి ప్రయత్నించారు. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌ రజియాబేగం, అవుసుల నాగరాణి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు రూ.10వేలు నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే విధంగా కిష్టంగారి రాజయ్య, ప్రవీణ్‌, రవికుమార్‌లకు చెందిన ఇంటి తాళాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు క్లూస్‌ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

వ్యక్తి అదృశ్యం

వర్గల్‌(గజ్వేల్‌): వ్యక్తి అదృశ్యమైన ఘటన వర్గల్‌ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్‌ కథనం మేరకు.. వేలూరుకు చెందిన చింతకింది మహేశ్‌(35) అన్నాదమ్ముళ్ల మధ్య కొంత కాలం నుంచి ఇంటి భూమి పంపిణీ విషయంలో గొడవ జరుగుతోంది. వివాదం ఎంతకూ పరిష్కారం కావడం లేదనే మనస్తాపంతో మహేశ్‌ రెండు పేజీల లేఖను రాసి, సెల్‌ఫోన్‌తోపాటు ఆ లేఖను ఇంట్లోనే పెట్టి గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చీకటి పడినప్పటికీ ఇంటికి రాకపోవడంతో భార్య అనూష, కుటుంబీకులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం భార్య అనూష ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'నాటి'న మొక్కలేవీ?

- పుల్లూరు గ్రామంలో పల్లె ప్రకృతి వనం తొలగింపు
- మైదానంగా మారిన స్థలం
- రూ.5 లక్షల వ్యయంతో మొక్కల పెంపకం
- పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు



చెట్లను తొలగించడంతో మైదానంగా మారిన ప్రకృతి వనం

సిద్దిపేటరూరల్‌: ప్రజలకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో పచ్చదనం పోయి ఆ స్థలమంతా మైదానంగా మారిన ఘటన పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో ఎలాంటి అనుమతి లేకుండా దౌర్జన్యంగా చెట్లను తొలగించారు. ఈ విషయంపై ఇటీవల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పి అనంతరం పట్టించుకోలేదు.

ఆలస్యంగా వెలుగులోకి..

బుధవారం ప్రభుత్వ సెలవు కావడంతో పంచాయతీ కార్యదర్శికి చెట్లను తొలగించిన విషయమై ఎలాంటి సమాచారం లేదు. గురువారం గ్రామానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శికి విషయం తెలియడంతో వివరాలు సేకరిస్తున్నారు.



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

అటవీ శాఖ అధికారియే ప్రత్యేకాధికారి

పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు చనిపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా హరిత సైనికుడిని పెట్టి సంరక్షిస్తున్న క్రమంలో ఇలాంటి చర్యలు జరగడం హేయమైన చర్య. మండలానికి అటవీ శాఖ అధికారి ప్రత్యేకాధికారిగా ఉన్న క్రమంలో ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పోలీసులకు ఫిర్యాదు చేశా..

గ్రామానికి చెందిన పల్లెప్రకృతి వనంలో సుమారు 1,000 మొక్కలు నాటి గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాం. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.5 లక్షలతో నిర్మించిన వనాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాను. దీంతో శుక్రవారం గ్రామానికి వచ్చిన పోలీసులు పంచనామా నిర్వహించారు.

– రవి, పంచాయతీ కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



అనుమతి లేకుండా పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను ధ్వంసం చేసిన వారి వివరాలు సేకరిస్తాం. కేసు నమోదైన అనంతరం ప్రభుత్వ ఆస్తిని నాశనం చేసిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ప్రభుత్వ ఆస్తులకు, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తే కఠి చర్యలు తీసుకుంటాం. సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– దేవకీదేవి, జిల్లా పంచాయతీ అధికారి